క్లుప్తంగా

జిల్లా పరిశ్రమల మేనేజర్‌ను కలిసిన చర్మకారులు


అధికారులతో చర్మకారులు

జమ్మికుంట: జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, చార్టెడ్ అకౌంటెంట్ చంద్రశేఖర్‌ను జమ్మికుంట లీడ్ క్యాప్ చర్మకారుల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రామంచ రాజారాం ఆధ్వర్యంలో చర్మకారులు గురువారం కలిశారు. ఈసందర్భంగా మలుపు చర్మకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి పథకం ద్వారా రూ.పది లక్షలులోపు అందించే ప్రాజెక్టుల వివరాలు తెలియజేశారు. కొటేషన్ తయారు చేసుకోవాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జమ్మికుంటలో లెదర్ పార్క్ ప్రాంగణంలో లెదర్ క్లస్టర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాచపల్లి మహేశ్, ఉపాధ్యక్షుడు మోతె స్వామి, శనిగరపు సంపత్, జన్నె కొండయ్య, మారెపల్లి పోశెట్టి, ఇమ్మడి రాజు, ఇల్లందుల రాజేందర్, కొంరయ్య, భూమయ్య, మడిపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

జమ్మికుంట: కొత్తపల్లి, ధర్మారం రెవెన్యూ పరిధిలోని 431, మున్సిపాలిటీలోని 629 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేశారని వారిపై విచారణ చేపట్టాలని జమ్మికుంట తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఎండీ సలీంపాషా తదితరులు గురువారం వినతిపత్రం అందజేశారు. 431లో ఆరెకరాల ముప్పై గుంటల ప్రభుత్వ భూమి ఉండగా కొత్తపల్లి శ్మశాన వాటిక, బీడీ కార్మికులు, మసీదు నిర్మాణం, నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా మిగులు భూమిని కొందరు కబ్జా చేసి ఆక్రమించుకున్నారని, భూమికి హద్దులు నిర్ణయించాలని కోరారు. 629లో ఎకరం భూమిని అధికార పార్టీ నాయకులు, బీనామీల పేర్లతో ఆక్రమించి నిర్మాణం చేయకున్న ఇంటి నంబర్లు తీసుకొని ఒక్కొక్కరు పది గుంటల భూమిని జీవో 59 నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తు చేసుకున్నారని వాటిని రద్దు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ స్థలానికి ఇంటి నంబర్లు కేటాయించిన మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామన్నారు. కలెక్టర్, ఆర్డీవోకు స్పీడ్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశామని వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో రాజమౌళి, రంజిత్‌రెడ్డి, ప్రభుదాస్, పంజాల మొగిలి, మహేందర్ నాయకులు పాల్గొన్నారు.

దళితులు పోరాటం చేయాలి


మాట్లాడుతున్న సంపత్

తిమ్మాపూర్: దళితుడిని తెలంగాణ తొలి సీఎం చేస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత అధికార దాహంతో తానే గద్దె నెక్కాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎలుకపల్లి సంపత్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాజు, సముద్రాల లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. నిరుద్యోగ భృతి, రైతులకు ఉచిత ఎరువులు, దళితబంధు అంటూ మోసం చేశారని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వకపోగా గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను లాక్కుంటున్నారని మండిపడ్డారు. దళితులంతా ఏ పార్టీలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి రాజు, సీనియర్ నాయకుడు కమలాకర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ముందుచూపుతో తప్పను ముప్పు

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- డ్రైనేజీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం తొలగింపు


గాంధీనగర్‌లో డ్రైనేజీలోని సిల్ట్‌ను జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, నిర్వహణ లోపాల కారణంగా ఏటా వరద సమస్య తలెత్తుతోంది. ఫలితంగా ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దీంతో వర్షాకాలంలో ప్రజలు విషజ్వరాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఖాళీ స్థలాలు మురికికూపాలుగా దోమల ఉధృతికి నిలయంగా మారుతున్నాయి. ఆయా స్థలాలను శుభ్రం చేయించాలని యాజమానులకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసినా తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షణ కొనసాగించాల్సిన తరుణమిది. మరోవైపు మూడు రోజులుగా కురుకుస్తున్న వానలతో డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు, వరదనీరు రోడ్లపైకి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగుకాలువల్లో పూడికతీత చేపట్టాల్సిన అవసరం ఉంది.

శాశ్వత చర్యలు చేపట్టాలి

హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో నాలుగు విలీన గ్రామాలు కలుపుకొని మొత్తం 30 వార్డులు ఉన్నాయి. 112 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఐదు ఫాగింగ్ యంత్రాలు ఉండగా ఇందుల్లో మూడు యంత్రాలు మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డాయి. జనాభా 50 వేలకు పైగా ఉంటుంది. ఆయా కాలనీల్లో ప్రధాన కాలువలతో పాటు చిన్న కాలువలు విస్తరించి ఉన్నాయి. పలు కాలనీల్లో డ్రైనేజీలు సరిగ్గా శుభ్రం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వరదకు మురుగునీరు తోడై రోడ్లను ముంచెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద చేరుతోంది. భారీ వర్షాలకు ఇళ్ల ఆవరణలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వర్షకాలం ముంపు ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. మామిండ్లవాడ, పోచమ్మవాడ, ప్రతాపవాడ, ఇస్లాంనగర్, బుడగజంగాలకాలనీ, గాంధీనగర్ సమస్యలు ఎదురయ్యే ప్రాంతాలు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



సీజన్‌కు ముందే ముంపు ప్రభావిత ప్రాంతాలను గుర్తించాం. ఇప్పటికే ఆయా చోట్ల ఉన్న పెద్ద కాలువల్లో యుద్ధ ప్రాతిపాదికన పూడికతీత పనులు చేపట్టాం. వర్షాల నేపథ్యంలో సమస్య ఎక్కడ ఎదురైనా పరిష్కరించేందుకు ఇంజినీరింగ్ అధికారులు, పారిశుధ్య కార్మికులు సిద్ధంగా ఉన్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

హుజూరాబాద్: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సాదాసీదాగా నిర్వహించారు. సమావేశంలో 82 అంశాలను ప్రస్తావించగా పాలకవర్గం 80 అంశాలకు ఆమోదం తెలిపినట్టు రాధిక తెలిపారు. కమిషనర్ ప్రతిపాదన మేరకు ఆదాయం సమకూర్చుకోవడానికి పురపాలక సంఘం పాత షెటర్ల కిరాయి పెంచేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఇటీవల మృతి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ గోస్కుల రాజు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి 25 మంది కౌన్సిలర్లు రూ. 2.50 లక్షలు మృతుడి సతీమణికి అందజేసి ధాతృత్వం చాటుకున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రామ్మోహన్‌రాయ్, ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి అశ్విని, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరాజంకు నివాళి

గంగాధర: అనారోగ్యంతో మృతి చెందిన పద్మశాలీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు, కార్మిక సంఘం నాయకుడు చిప్ప లక్ష్మీరాజం మృతిపట్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని సత్యనారాయణ, చిందం రాజమౌళి సంతాపం తెలిపారు. గురువారం గర్శకుర్తి గ్రామంలో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా లక్ష్మీరాజం సేవలను గుర్తు చేసుకున్నారు.

యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మధ్యంతర భృతి, పీఆర్‌సీ కమిటీ వేయాలని, పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, జీపీఎస్, టీఎస్ జీఎల్ఐక్లెయిములు, పెన్షనరి బెనిఫిట్స్, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈహెచ్ఎస్ సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, బదిలీలు, పదోన్నతులు, నియామకాలు చేపట్టి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 317జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరహరి, రాష్ట్ర కౌన్సిలర్ సదానందం, ఇల్లందకుంట అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి సంపత్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, చంద్రమౌళి, చేరాలు, కిరణ్, వెంకటేశ్వర్లు, కరుణాకర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల భిక్షాటన, వంటావార్పు


మానకొండూర్‌రూరల్: భోజనం చేస్తున్న కార్మికులు

జమ్మికుంట: ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారంతో 15వ రోజుకు చేరకుంది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో కార్మికులు గురువారం భిక్షాటన చేశారు. కనీస వేతనం రూ.19,500, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వ స్పందన లేదన్నారు. కార్మికుల జేఏసీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆయా గ్రామాల జీపీ కార్మికులు గురువారం వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం ఎదుట భోజనాలు చేశారు. కొద్ది రోజుల నుంచి సమ్మెచేస్తున్న ప్రభుత్వం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల సఫాయిలు, కారోబార్లు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడి చేసిన నీరు తాగాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యుత్ లైన్‌ల కింద సెల్‌ఫోన్ వాడకం సరికాదన్నారు. వాటర్ హీటర్లు జాగ్రత్తగా వాడాలని, పాత గోడలు, ఇళ్లు, కూలిపోయే దశలో ఉన్న షెడ్ల వివరాలను మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని, చిన్న పిల్లలను కరెంట్ వస్తువులకు దూరంగా ఉంచాలని, ఇనుప తీగలపై బట్టలు ఆరవేయొద్దన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, శ్రీధర్ రెడ్డి, రవిందర్, అంజయ్య, రాజయ్యపాల్గొన్నారు.

శంకరపట్నం: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. తహసీల్దార్ ఆఫీస్‌లో మాట్లాడుతూ.. పెంకుటిళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, ఇళ్లు కూలినా, వరద ప్రాంతాలపై సమాచారం అందిస్తే సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. ఇనుప స్తంభాలను ముట్టుకోవద్దని, విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జా గ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపదలో తమతోపాటు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

హుజూరాబాద్: దొంగిలించిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకోవడానికి సీఈఐఆర్ యాప్ ఎంతో ఉపయోగకరమని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూ రాబాద్ పోలీస్ స్టేషన్‌లో యాప్ ద్వారా పట్టుకున్న సెల్‌ఫోన్‌ను పో గొట్టుకున్న వ్యక్తికి అందజేశారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టిందని, సెల్‌ఫోన్ పోయినా, ఎవరైనా దొంగిలిస్తే వెంటనే ఆన్‌లైన్‌లో ఫోన్‌కు సంబంధించిన వివరాలను ఎంటర్ చేసి బ్లాక్ చేయాలని తెలిపారు. అనంతరం సీఐ బొల్లం రమేశ్ మాట్లాడుతూ... ఇప్పటివరకు హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 మందికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేశామని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

చొప్పదండి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ అంబటి రజిత, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ఈవీఎంల పనితీరు వివరించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిరోజు తహసీల్దార్ కార్యాలయంలో సేవలు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. ఆర్ఐ అరుణ్‌కుమార్, తదితదరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల పని తీరుపై అవగాహన కార్యాక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మండలంలోని ప్రజలు ఓటు వినియోగంపై అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోడీటీ నవాజ్, కిరణ్, ఆర్ఐ సమీన, కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు ట్రైనర్లు శ్రీనివాస్, రవీంద్రాచారి శిక్షణ ఇచ్చారు.

నియామకం

గన్నేరువరం: యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మండలంలోని చొక్కారావుపల్లె గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా గన్నేరువరం గ్రామానికి చెందిన బొడ్డు సునీల్ నియామకమయ్యారు. ఈమేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నవీన్‌కు సన్మానం

గన్నేరువరం: యూత్ కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ సెక్రెటరీగా నియామకమైన గన్నేరువరానికి చెందిన రాపోలు నవీన్‌ను గురువారం మండల కేంద్రంలో పార్టీ, యువజన నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దేవరాజ్ అనిల్, అజయ్, హరీశ్, అనీల్, శ్రీమాన్ సాయి, దేశరాజ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్‌పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మండలంలోని చెల్పూర్ రైతువేదికలో గురువారం రైతులతో అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, వ్యవసాయరంగానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం రైతులను అవమానించినట్టేనని, తెలంగాణలో పార్టీకి భవిష్యత్ లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: కాంగ్రెస్ లాంటి దుష్టశక్తులు ఎన్ని వచ్చినా రైతులను కాపాడుకునేది కేసీఆర్ ప్రభుత్వమని కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని వావిలాల క్లస్టర్ రైతువేదికలో ఆయా గ్రామాల రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ నష్టం చేయాలని చూస్తోందన్నారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ గెలుస్తుందని సర్వేల్లో తేలడంతో బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు జీర్ణించుకుంటలేరని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశం, ఆయా గ్రామాల సర్పంచులు జక్కెన శ్రీలత, మహేందర్, సుంకిశాల పద్మ, రాజకొమురయ్య, కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల రైతు సమన్వయ సమితి అక్షుడు లింగారావు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం


మానకొండూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

సైదాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరమల్ల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. పథకాలు అమలు చేయకుండానే పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకోవడం బీఆర్ఎస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. 24 గంటల ఉచిత కరెంట్‌తో మూడు పంటలు పండుతున్నాయనేది అబద్ధమన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తే అరెస్టు చేయించడం బాధాకరమన్నారు.

జమ్మికుంట: అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని ప్రకటనలో పేర్కొన్నారు.

గన్నేరువరం: అరెస్టులను నిరసిస్తూ గురువారం మండలంలోని గుండ్లపల్లిలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. రాష్ట్రంలో అణిచివేత పాలన కొనసాగుతోందని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, తాళ్లపల్లి పర్శరాం, గడ్డం సుమిత్‌రెడ్డి, మునిగంటి సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానకొండూర్: కిషన్‌రెడ్డిని అరెస్టును నిరసిస్తూ మానకొండూర్‌లో బీజేపీ నాయకులు కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అజయ్‌వర్మ, రాపాక ప్రవీణ్, లక్ష్మణాచారీ, శ్రీనివాస్, ప్రభాకర్, ఆంజనేయులు, ఆరెల్లి శ్రీహరి, కొండ్ర సురేష్, ప్రదీప్‌యాదవ్, రవీందర్, శశిధర్, అరుణ్, అనిల్, కిరణ్ పాల్గొన్నారు.

రహదారిని కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయం ఎదురుగా రాజీవ్ రహదారిని చెట్ల కొమ్మలు కమ్మేస్తున్నాయి. వర్షానికి ఏపుగా పెరిగిన చెట్లు వంగి కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ఓ వాహనదారుడు వర్షంలో చెట్టుకొమ్మలను ఢీకొని కిందపడ్డాడు. సమీపంలోనే పాఠశాలలు, కళాశాలల ఉండడంతో విద్యార్థులు సైతం ప్రమాదాలకు గురయ్యేగే అవకాశం ఉంది. హెచ్‌కేఆర్ సంస్థ రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. టోల్ వసూల్‌పై చూపుతున్న శ్రద్ధ రహదారి నిర్వహణపై చూపడం లేదుని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్: మానకొండూర్ చెరువుకట్ట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులకు గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన దాసరి వంశీకృష్ణ(24) ఆకునూరి కిషోర్ (25)బుధవారం కరీంనగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లారు. అర్ధరాత్రి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. మానకొండూర్ చెరువుకట్ట వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థికి ఆర్థికసాయం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని 16వ వార్డుకు చెందిన ఆకునూరి రాజయ్య, సంపూర్ణ దంపతుల కుమారుడు సామెల్ వికారాబాద్ మహావీర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నిరుపేద కుటుంబ కావడంతో చదువుకునేందుకు ఇబ్బందులుపడుతున్నాడు. విషయం మాస్(మహా ఆది సేవా సమితి) దృష్టికి రావడంతో గురువారం ఆయన ఇంటికెళ్లి రూ.15వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాస్ కమిటీ సభ్యులు మొలుగూరి సదయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయులు వేల్పుల స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


గంగాధరలో వివరాలు తెలుసుకుంటున్న బృందం

గంగాధర: స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన గంగాధర గ్రామాన్ని గురువారం కేంద్ర పరిశీలన బృందం సభ్యులు వెంకటేశ్, వేణు సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వైకుంఠధామం, సెగ్రిగేషన్‌షెడ్డు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం, వాడకంపై ఆరా తీశారు. వెంట సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, సీతారాంపురం గ్రామాల్లో కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పరిశీలక బృందం గురువారం పర్యటించింది. ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, కంపోస్టు షెడ్డు, కమ్యూనిటీగుంతలు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బృందంలో కిషోర్, గణేష్, రాకేశ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రమేశ్, డీపీవో వీర బుచ్చయ్య, డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీపీ కొత్త వినీత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, ఎంపీవో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై రాజకీయం వద్దు

గంగాధర: తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరో గ్యంపై రాజకీయం చేయకుండా ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రీమియం రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.800కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీ ఆర్‌కు అధికార వ్యామోహం తీరలేదని, ఎలాగైనా అధికారంలోకి రావడానికి అమలుకునోచుకోని హామీలిస్తూ ప్రజలను మరోసారి మోసం చేయాలని ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు.

సామాజిక సేవతో ఆనందం


పండ్లు పంపిణీ చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

జమ్మికుంట: సామాజిక సేవలో ఆనందం ఉందని గోదావరి అర్బన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కొండ కుమారస్వామి అన్నారు. పట్టణంలో బ్యాంక్ స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇల్లందకుంట వృద్ధాశ్రమంలో పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు, చిరు వ్యాపారులకు రైన్‌కోట్లు అందించారు. విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సతీష్, సృజన్‌కుమార్, స్పందన, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.